జోరుగా బెల్ట్‌దందా

- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- గ్రామాల్లో బెల్ట్‌షాపులకు వేలం నిర్వహిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు


తలమడుగులో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్

తలమడుగు: గ్రామాల్లో బెల్టుషాపుల దందా జోరుగా కొనసాగుతోంది. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బెల్ట్ షాపులు దక్కించుకోవడానికి పోటీపడి ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ దుకాణాల్లో, రోడ్ల సమీపంలో, పంట పొలాల్లో బెల్ట్‌షాపులు ఇష్టానుసారంగా నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల వేలం పాడి బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. ఒక్కో బెల్ట్‌షాపునకు రూ.లక్ష వెచ్చించి సొంతం చేసుకుంటున్నారు. తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాలు మహారాష్ట్ర సమీపంలో ఉండడంతో సరిహద్దు గ్రామాల్లో దేశీదారు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

అధిక ధరలకు విక్రయాలు..

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తూ మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. బెల్ట్ షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో చిన్న చిన్న గ్రామాల్లో బెల్ట్‌షాపులకు వేలం నిర్వహించేవారు. ఈసారి పెద్ద గ్రామాల్లో సైతం రూ.లక్ష నుంచి రూ. 20 లక్షల వరకు వేలం పాడి షాపులను దక్కించుకుంటున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు వెచ్చిస్తున్నారంటే ఏ స్థాయిలో బెల్ట్‌షాపుల దందా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. కాగా కొన్ని కిరాణా దుకాణాల్లో సైతం బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. వైన్‌షాపులకు తీసిపోని విధంగా బెల్ట్‌షాపుల్లోనూ తినుబండారాలు ఏర్పాటు చేస్తున్నారు.

బానిసగా మారుతున్న యువత..

తలమడుగు మండలంలో రెండు వైన్‌షాపులు, తాంసి మండలంలో ఒక వైన్ షాపు, భీంపూర్ మండలంలో ఒక వైన్స్ షాపు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో అందుబాటులో విచ్చలవిడిగా మద్యం దొరకడంతో మద్యానికి యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. యువత మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయక జీవితంపై విరక్తితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల నివారణకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేస్తున్నాం. గ్రామాల్లో ఎవరైనా కిరాణా దుకాణంలో, ఎక్కడైనా మద్యం విక్రయించినట్లు సమాచారం ఇస్తే దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నాం. సమాచారం ఇచ్చిన వారి పేరు గొప్యంగా ఉంచుతాం.

– అంజమ్మ, ఎస్సై, తలమడుగు

క్లుప్తంగా

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న మనోహర్

నేరడిగొండ: ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనారోగ్య సమస్యలతో వచ్చేవారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

పొరా దేవి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం మహారాష్ట్రలోని ప్రసిద్ధి గాంచిన లంబాడాల దైవం పొరాదేవి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్ గౌడ్, బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నానాక్ సింగ్, ప్రతాప్ సింగ్, జాదవ్ భీంరావు నాయక్ తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం'


సన్మానిస్తున్న బుర్కపల్లి గ్రామస్తులు

నేరడిగొండ: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిపించుకుందామని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ మండలాల అధ్యక్షుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను యువతకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్ రెడ్డిని గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విన్నపం

బజార్‌హత్నూర్ మండలంలోని బుర్కపల్లి గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయనను శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు ముఖ్య కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. వాటిపై పెండింగ్‌లో ఉన్న జరిమానాలు పరిశీలించారు. పెండింగ్ చలాన్లు చెల్లించిన తర్వాత వాహనాలను తిరిగి అందజేశారు. భారీ శబ్ధం గల సైలెన్సర్లను అమర్చకూడదని, నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మాంగ్ కులస్తులను 2వ గ్రూప్‌లో చేర్చాలి

బోథ్: ఎస్సీ వర్గీకరణలో భాగంగా ప్రభుత్వం మాంగ్ కులస్తులను 1వ గ్రూప్‌లో చేర్చిందని, తమను 2వ గ్రూప్‌లో చేర్చాలని మాంగ్ కులస్తులు మంగళవారం సొనాల తహసీల్దార్ మల్లేశ్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. గతంలో కొనసాగిన వర్గీకరణలో తాము 2వ గ్రూప్‌లో ఉన్నామన్నారు.

సమస్యల పరిష్కారానికి పైలెట్ ప్రజావాణి


దరఖాస్తులు పరిశీలిస్తున్న యువరాజ్ ముర్మూ



సమస్యలు వింటున్న అధికారులు

- సబ్ కలెక్టర్ యువరాజ్ ముర్మూ

నార్నూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మండల కేంద్రంలోని పైలెట్ ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార బహిరంగ చర్చవేదిక నిర్వహిస్తుందని సబ్ కలెక్టర్ యువరాజ్ ముర్మూ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం మీటింగ్‌హాల్‌లో నిర్వహించిన పైలెట్ ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ జాడీ రాజలింగు, ఎంపీడీవో జవహర్ లాల్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ గంగాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్, పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు, ఏవో అవినాశ్, ఏఈ నిరంజన్ పాల్గొన్నారు.

తాంసి: గ్రామాల్లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పైలెట్ ప్రజావాణి –ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం బహిరంగ విచారణ వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి సీపీవో వెంకట రమణ, ఆర్డీవో వినోద్ కుమార్ హాజరయ్యారు. ప్రజావాణి బహిరంగ విచారణలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. మండలవ్యాప్తంగా మొత్తం 115 దరఖాస్తులు రాగా వాటి విచారణ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు దరఖాస్తుదారులు గందరగోళం సృష్టించగా పోలీసులు రంగప్రవేశం చేసి సర్ది చెప్పారు. ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, విద్యుత్ శాఖ ఏఈ మనోజ్, ఎంఈవో శ్రీకాంత్, ఏవో రవీందర్, ఎంకేఎస్‌ఎస్ సివిల్ సొసైటీ యాక్టివిటీ సభ్యులు నిఖిల్, స్టేట్ కోఆర్డినేటర్ శ్రీహర్ష, మండల కోఆర్డినేటర్ రమాకాంత్‌తో పాటు అధికారులు ఉన్నారు.

'ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి'


షెడ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సురేశ్ జాదవ్

నార్నూర్: ఉపాధిహామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో సురేశ్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నిర్మిస్తున్న కోళ్ల ఫారం షెడ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు మట్టి రోడ్లు, గ్రావెట్ రోడ్ల నిర్మాణం, కాలువలు, నాలాలపై చెక్ డ్యామ్ నిర్మాణాలు, కోళ్ల ఫారం, పశువుల పాక, ఆర్ఓఎఫ్ఆర్ భూమిలో చెదలు చేయడంతో పాటు వివిధ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు పనుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. టీఏ కైలాస్ జాదవ్, మోహన్ కుర్సెంగా, మోతిరాం తదితరులు ఉన్నారు.

'కుల గణన తప్పుల తడక'


మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని, ప్రభుత్వం చేపట్టిన కుల గణన తప్పుల తడకగా ఉందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి సీఎం పదవి శాశ్వతం కాదని, అధికార దాహంలో బీసీ గణనలో తక్కువ చూపించారని పేర్కొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు దాసరి రమేశ్, గంగయ్య, శ్రీనివాస్, ధమ్మపాల్, సతీశ్, రాజు, పరమేశ్వర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జైనథ్ మండలంలోని మకోడ గ్రామంలో జోగు ఆశన్న–భోజమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. గంగన్న, గోవర్ధన్, వెంకన్న, భూమన్న, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను నిత్యం పరిశీలించాలి


పరిశీలిస్తున్న జీసీడీవో మేస్రం చాయ

బేల: విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఐటీడీఏ జీసీడీవో మేస్రం చాయ ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలకు సూచించారు. మంగళవారం మండలంలోని చంపెల్లి గ్రామంలోని ఎస్టీ బాలికలు ఆశ్రమ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య రికార్డులతో పాటు మందులు, మాత్రలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణపై పరిశీలించారు. విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించి, అభ్యసన సామర్థ్యాలపై ఆరా తీశారు. ఆమె వెంట హెచ్‌ఎం కుర్సంగే నీలకంఠ, ఎస్ఈఆర్‌పీ ఆనంద్‌రావు ఉన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్య విధానంపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్: ఆక్యుపంచర్ వైద్య విధానంపై ఆర్ఎంపీ, పీఎంపీలు అవగాహన పెంచుకోవాలని ఆక్యుపంక్చర్ స్పెషలిస్ట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు ఆర్ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయుర్వేద, ఆక్యుపంక్చర్ వైద్య విధానాలపై బెంగుళూరుకు చెందిన నిపుణులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినిధులు భీముడు, నర్సింలు, వెంకటేశ్వర్, ప్రేమ్ సింగ్, సయ్యద్ గౌస్ అలీ, రాజేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠుపై అపోహలు వీడాలి


ఎంపల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాగర్

నార్నూర్: ప్రజలు కుష్ఠు వ్యాధిపై అపోహలు వీడాలని డీఎస్‌ఎంవో డాక్టర్ సాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపల్లి గ్రామంలో స్పర్శ్ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెన్‌లో భాగంగా కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ శరీరంపై పాలిపోయిన రాగి రంగు, మొద్దు బారిన మచ్చలు, కాళ్ల చేతుల్లో తిమ్మిర్లు రావడం లక్షణాలన్నారు. వ్యాధికి ఆధునిక చికిత్స అన్ని ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నార్నూర్ రాంబాబు, డీపీఎంవోలు వామన్ రావు, రమేశ్, సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ శివారు ప్రాంతంలో గల 2వ పోలీస్ బెటాలియన్‌లో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్‌తో పాటు అక్కడి ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన


తాంసి: పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి

తాంసి: రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం భీంపూర్ ఎంపీడీవో గడ్డం గోపాలకృష్ణారెడ్డి ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాల జాబితాను తెలియజేశారు. మండలంలో 43 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీవో సుమేర్ అహ్మద్, టీఏ మజర్, ఈసీ నరేందర్ ఉన్నారు.

ఓటర్ల తుది జాబితా ప్రదర్శన

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ఓటర్ల తుది జాబితాను ఎంపీడీవో మహేందర్‌కుమార్ ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తంగా 9 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జెడ్పీటీసీకి ఓటర్ల తుది జాబితా ప్రదర్శించామన్నారు. 750 ఓటర్లకు ఒక్కో పోలింగ్ బూత్‌ను కేటాయించామని, మండలంలో మొత్తంగా 27,568 ఓటర్లకు 51 పోలింగ్ బూత్‌లను ఎన్నికల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంపీవో మహేశ్‌కుమార్, టైపిస్ట్ మథిన్, జూనియర్ అసిస్టెంట్ శశికుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువు, పరిసరాల పరిశుభ్రతపై కళాజాత బృందం మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాటలు, నాటికలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువు ప్రాముఖ్యత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ జి.సంగీత, కళాజాత బృందం సభ్యులు చాకటి రవీందర్, గుంజాల రమేశ్, వెంకట్రావ్, రాజలింగు, రాథోడ్ శంకర్, నగేశ్, ఆశిష్, నర్సమ్మ, శ్రీలత, రాజు, వైస్ ప్రిన్సిపాల్ లత, మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా కుంభమేళాలో ఎమ్మెల్యే పవిత్ర స్నానం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఆదిలాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం వద్ద మహా కుంభమేళాలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దంపతులు మంగళవారం పవిత్ర గంగా స్నానం ఆచరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, సాధువుల ఆశీర్వచనాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్ప ఆధ్యాత్మిక స్వరూపమైన త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

నేడు భీమన్న జాతర

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం గ్రామంలో బుధవారం భీమన్న దేవుని జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి గంపల అడెల్లు తెలిపారు. ఏటా మాఘ మాసంలో మాఘ పూర్ణిమ రోజు జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

నూతన అధికారులకు సన్మానం

బోథ్: కొత్త మండలంగా ఏర్పడిన సొనాలకు తహసీల్దార్, ఎంపీడీవోలుగా బాధ్యతలు చేపట్టిన అధికారులు మల్లేశ్, రాజేశ్వర్‌లను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహర్ సంఘం నాయకులు మంగళవారం వేర్వేరుగా సన్మానించారు. మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు భీంరావ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నామని, అందులోనే విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు సరితరాణి, ప్రమీల, మధుకర్, దళిత్, రవి ఉన్నారు.

కందుల కొనుగోళ్లు ప్రారంభం

నేరడిగొండ: మండల కేంద్రలో గల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏవో కృష్ణవేణి ప్రారంభించారు. కందులు పండించిన రైతులు తమ కందులను తేదీల వారీగా తీసుకొని వచ్చి విక్రయించాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7750 ఉందని తెలిపారు. సీఈవో నాగభూషణ్ ఉన్నారు.

బేల: మండలకేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో బేల, డోప్టాల సహకార సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కందుల కొనుగోళ్లను మండల వ్యవసాయ అధికారి సాయి తేజరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి గ్రామాల వారీగా కందుల కొనుగోళ్లు ఉంటాయని తెలిపారు. సీఈవోలు తిరుపతి, రాహుల్, కార్యదర్శులు నిపుంగే గణేశ్, ప్రశాంత్, ఏఈవోలు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేశ్ కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ

బోథ్: మండలంలోని పొచ్చెర, కనుగుట్ట, కరత్వాడ, సొనాల మండల కేంద్రంలోని పలు పాఠశాలలలో యుద్ధభేరి పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్ మాట్లాడుతూ మార్చి 2వ తేదీన హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించే కార్యక్రమానికి సీపీఎస్ బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం కోశాధికారి చిలుక సతీశ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'జమాతే ఏ ఉల్మా హింద్'కు శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం బొక్కలగూడలోని జమాతే ఏ ఉల్మా హింద్ సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ బాధ్యులు అబ్దుల్ ఘని, అబుబకర్, హఫీజ్ మన్సూర్, హఫీజ్ అహ్మద్ కంది శ్రీనివాసరెడ్డిని సాదరంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు. అనంతరం సంస్థ బాధ్యులను కంది శ్రీనివాసరెడ్డి సత్కరించి కార్యక్రమ నిర్వాహకులు నాయకులు మహ్మద్ ముజాహిదుద్దీన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఖిజర్ పాషాలను అభినందించారు.

నిత్యావసర సరుకులు అందజేత

తాంసి: రెండు కిడ్నీలు చెడిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న మండల కేంద్రానికి చెందిన యువకుడు కోట్రంగి అశోక్ కుటుంబానికి గ్రామ యువకులు అండగా నిలిచారు. మంగళవారం అశోక్ ఇంటికి వెళ్లి తమవంతు సాయంగా రూ.3వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో యువకులు రాము యాదవ్, కార్తిక్, నర్సింగ్, రాము తదితరులు ఉన్నారు.

రజక సంఘం కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంతో పాటు నూతనంగా ఏర్పడిన భోరజ్ మండలాల రజక సంఘాల మండల కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. జైనథ్ మండల అధ్యక్షుడిగా ముక్కెర వికాస్, ప్రధాన కార్యదర్శిగా కె.పొచ్చన్న, ఉపాధ్యక్షుడిగా రాజులను ఎన్నుకోగా, భోరజ్ మండల అధ్యక్షుడిగా సంతోష్, ప్రధాన కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సత్కరించారు.

అడవులను పరిరక్షించాలి

బోథ్: ప్రతి ఒక్కరూ అడవులను రక్షించేందుకు పాటు పడాలని ఎఫ్ఎస్‌వో ముంతాజ్ అన్నారు. మంగళవారం సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవులకు నిప్పు పెట్టడం చట్టరీత్యా నేరమన్నారు. ఎఫ్‌బీవో రాధేశ్యామ్, అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి

ఇంద్రవెల్లి: మహిళల చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని సఖి కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. మంగళవారం మండలంలోని పిట్టబొంగరం ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా సాధికారత కేంద్రం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, కోటేశ్వర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన టీచర్లను తొలగించాలి

ఎదులాపురం: నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన టీచర్లను తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024 డీఎస్సీలో ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన టీచర్లను తొలగించాలన్నారు. తప్పులను చూసుకోకుండా ఉద్యోగాలకు ఎంపిక చేసిన డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడాం జంగుదేవ్ పటేల్, జిల్లా నాయకులు వెంకటేశ్ నేత, దీపక్ కుమార్, ఉపేంద్ర, కోటేశ్, తుకారాం, మోతిరాం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల మంజూరు కోసం జిల్లాలో ఇంటర్ ఆపై చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దళితాభివృద్ధి శాఖ అధికారి సునిత కుమారి ప్రకటనలో తెలిపారు. ఫ్రెష్, రెన్యూవల్ కోసం మార్చి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.